# వినిపించని రాగాలు

— ఝాన్సీ కె.వి.కుమారి




రాత్రి తొమ్మిదయింది. మిత్ర బృందమంతా చెల్లాచెదరైనట్లుంది. ఇద్దరు ముగ్గురు సినిమాకి కొట్టేసినట్టున్నారు. పిడిగాళ్ళు రుబ్బుతున్నారు. కొందరు వ్యాహ్యాళి దశలో ఉన్నారు అప్పుడే. కొంచెం ఆకలిగా ఉంది నాకు. అందుకని మెస్‌లోకి వెళ్ళి నాల్గు మెతుకులు కతికి ఈ క్షుద్బాధను అణచుకొని బయటపడ్డాను. మా మెస్ మాత్రం అన్నపూర్ణలెండి! ఏ వేళ వచ్చినా కడుపును 'చల్లగా' నింపుతుంది. మా బోయ్స్ కూడ చాల మంచివాళ్ళు.

'మెస్' నుండి సరాసరి రూముకు వచ్చాను. రమేష్‌గాడు కుంభకర్ణుడి కవల తమ్ముడిలా బుసలు కొడుతున్నాడు. "బ్రతికించావురా భగవాన్" అనుకొని త్వరత్వరగా బట్టలు మార్చుకొని, నేను కూడ నా పడకమీద ఒరిగిపోయాను. రమేష్‌గాడు మేల్కొనుంటే ఈపాటికి నా ప్రాణం కొరికేసేవాడు —

"ఇప్పటివరకు -- ఇంత రాత్రివరకు ఎక్కడికెళ్ళావురా? లాస్ట్ అవర్ ఎందుకు ఎగ్గొట్టేవ్? ఈమధ్య నువ్వు బాగా చెడిపోతున్నావురా?" ఇంకా ఇలాంటివే ఏవేవో అంటూ... కాని... ఇప్పుడు వాడు ఈ లోకపు దరిదాపుల్లో లేకుండా, ఎక్కడో ఏ లోకాల్లోనో విహరించడం నాకు చాలా 'రిలీఫ్'గా ఉంది.

పక్కమీద వాలేనో లేదో, బుర్రను ఎన్నో ఆలోచనలు, బెల్లాన్ని ఈగలు ముసురుకొన్నట్లు ముసురుకున్నాయ్. ఒక చిన్ని సవరణ · ఏమంటే... బెల్లం తీయగా ఉంటుందని ఈగలు ముసురుకుంటాయ్‌గాని, బుర్ర తీయగా ఉంటుందని మాత్రం ఆలోచన్లు ముసురుకోవు. ఆలోచనలే మధురంగా ఉంటాయని బుర్ర వాటిని వెదకి వెదకి తెచ్చుకొంటుంది ఎడతెరిపి లేకుండా! ఇప్పుడు నా బుర్రకూడ అదే పని చేస్తోంది!!

'లాస్ట్ అవర్' ఎగ్గొట్టేనని రీడర్‌గార్కి ఏం కోపం వచ్చిందో ఏమో! అందునా నేనే కాకుండా, నీలిమను కూడ లాక్కెళ్ళాను. ఆయన క్లాసంటే మా కందరికీ బోరే! ఆయన నాలుగైదు క్లాసుల్లో చెప్పేది మేము ఒక్క గంటలో హాయిగా నేర్చుకోగలం! అందుకే ఆయిన క్లాసుల్లో కాకాసురులు తప్ప ఎవ్వరూ ఉండరు. పైగా, ఈ రోజు 'లాస్ట్ అవర్!' ఇక 'బోర్' భరించలేక పారిపోయామనుకోండి ... ఎగ్గొట్టుగాళ్లమంతా లైబ్రరీకి వెళ్ళి పుస్తకాల వేటలో మునిగిపోయాం. మా లైబ్రరీలో చాలా 'మిరకిల్స్' జరుగుతూంటాయ్ లెండి ... 'రిఫరెన్స్ సెక్షన్'లో ఉండాల్సిన పుస్తకాలు 'ఇష్యూస్'లో ఉంటాయ్...'ఇండెక్స్'లో ఉన్న 'చాప్టర్స్' పుస్తకం లోపల ఉండవ్! ఆశగా పుస్తకం తెరిస్తే – కత్తిరించబడిన మోడులు వెక్కిరిస్తూ ఉంటాయ్! నీలిమ, నేను ఎలాగో తంటాలుపడి రెండు 'షేక్స్పియర్ రిఫరెన్స్' పుస్తకాలు చేజిక్కించుకొని బయటపడ్డాం. అక్కడి నుండి తిన్నగా క్యాంటీన్‌కు వెళ్ళి, కడుపు శోకాణ్ణణచి, కబుర్లు చెప్పుకొంటూ రోడ్డుమీదకు వచ్చాం. పదవ నెంబరు బస్సు రడీగా ఉంది, ఎక్కేసేం. ఈ పది వాడు వాళ్ళని, వీళ్ళని చేరబోసుకొని, ఇంకో పది నిమిషాల్లో బయల్దేరాడు. వాడి పుణ్యమా అని 'రామక్రిష్ణ బీచ్' దగ్గర, క్షేమంగానే దిగాం నేనూ, నీలిమాదేవి! ఈ దేవిగార్ని 'దేవి' అంటే చాలు, మూతి ముదుముక్కార్చుంటుంది. మరీ అల్లరిచేస్తే... 'చెంపకు చేయి పరంబగును...' బాబోయ్, ఎందుకొచ్చిన దవడవాపుగాని, 'నీలూ' అనే అనుకుంటాను.

'నీలూ!' – ఓహ్, ఎంత చక్కగా ఉంది ఆ పేరు! నీవు మధురం... నీ పేరు మధురం... నీ రూపు మధురం... నీ తలపు మధురం... నీవున్న ఈ లోకం మధురం... నీవు నాతో ఉంటే... నా జీవితమే మధురాతి మధురం!!! నీలూ, నీవు నాదానివే కదూ! నీవు లేకుండా నేను జీవించగలనా? ఏ దుష్టఘడియలోనూ నీవు నాకు దూరం కావద్దు... ఏ అదృష్టదేవతో కరుణించి నిన్ను నాకు కానుకగా ఇచ్చింది!! ఈ కానుకను భద్రంగా జన్మజన్మల దాచుకుంటాను!!

అవునూ, అసలు నీలిమ నాతో ఎక్కువగా మాట్లాడదేమి? తన స్నేహితురాండ్ర గుంపులో ఉంటే ఒకటే గొడవ... మగపిల్లలకు పేర్లు పెట్టడం... ఏడ్పించడం... ఇవన్నీ చేస్తుంది — మరి, నా దగ్గర ఇలా మూగిదైపోతుందేం? గంటకో మాట నెమ్మదిగా మాట్లాడుతుంది... అప్పుడప్పుడూ సిగ్గు! ఆడపిల్లకు సిగ్గే సింగారమన్నారు. అలా సిగ్గుపడినప్పుడు ఎంత అందంగా ఉంటుంది నా నీలు!! అమాంతంగా నా వడిలోకి

తీసికొని... ప్స్... వద్దులే! చెంపకు చేయి...

అసలు, మా ఇద్దరి పరిచయం ఎంత గమ్మత్తుగా జరిగింది ? ఆ రోజు ...

నీలిమ తన మిత్ర బృందంతో బీచ్‌కి వచ్చింది. నేను రమేష్‌గాడి కోసం ఎదురుచూసి, చూసి విసుగెత్తి ఒక్కడినే సముద్రపు కెరటాలతో దాగుడుమూతలాడుతూ నడుస్తున్నాను. ఈ 'నీలిమా అండ్ కో' నా కెదురు రావడం నేను గమనించలేదు. వీళ్ళంతా, మా 'క్లాస్‌మేట్స్' అని, వెంటనే గుర్తు పట్టేను గాని, వాళ్ళపేర్లు బాగా తెలియదు ... అప్పుడే కదా 'క్లాసెస్' మొదలుపెడుతోంది ! కొద్ది కొద్దిగా ఒక్కొక్కర్ని తెలుసుకొంటున్నాం. నేను 'యూనివర్సిటీ ఫస్ట్' అని అప్పుడే అందరికీ తెల్సిపోయింది. నీలిమాదేవి, వాళ్ళ 'కాలేజి ఫస్ట్' అని ఎవరో అన్నారు. 'నీలిమా అండ్ పార్టీని' గురించి, అప్పటికే విని ఉన్న నాకు ఒంటరిగా ఈ గుంపును చూడగానే పై ప్రాణాలు పైనే పోయాయ్! అయినా ... మగధీరత్వంతో తప్పుకు పోబోయాను. కాని, అప్పటికే గుంపులో నుండి అరుపులు వెలువడ్డాయ్! ...

"హరి ఓం తత్సత్ ... "

"హరిలోరంగ హరీ, అబ్బాయిగారి పని హరీ ... "

నా మొహంలో ఒక్క రక్తపుబొట్టు కూడా లేదు. పళ్ళు పటపటలాడాయ్ ... కళ్ళు ఎర్రబడ్డాయ్ ... కాళ్ళు వణుకుతున్నాయ్ ... కాని, ఏం చేయను ? ఒంటరిగాణ్ణి ! తలకాయ గుండెల్లో దాచుకొని వాళ్ళను దాటి వచ్చేసేను. ప్రతీకారం ఎలా తీర్చుకోవాలా అని గుండె కుతకుతలాడిపోతోంది. రమేష్‌గాడిమీద కోపం మండిపోతోంది. వాడి వల్లనే గదా ... నేను ఒంటరినయ్యాను...మూడు నిమిషాల తర్వాత ...

"ఏమండీ, హరిగారూ" –

అన్న సన్నని మధురమైన స్వరం దగ్గరగా విన్పించింది. పాలిపోయిన మొహాన్ని ప్రయాసతో పైకెత్తాను. నీలిమాదేవి ? ప్రశాంతమైన మోముతో ఎదురుగా నిలబడి ఉంది !

"క్షమించండి !"

"చెయ్యగలిగింది చేసి, ఆ తర్వాత క్షమించ మనడం సభ్యత అన్పించుకొంటుందా?" తీక్షణంగానే అన్నాను. ఆవిడకు రోషం వచ్చినట్లుంది.

"ఆడపిల్ల ఒంటరిగా కనబడితే, మీ మగాళ్ళు ఎంత అల్లరిచేస్తారు? ఏడ్చేవరకూ విడిచిపెట్టరు?"

"అయితే, అటువంటి వాళ్ళకు నేర్పించండి మీ పాఠాలు ! నేనెప్పుడూ అలా చేయలేదు. నా కటువంటివి అలవాటు లేదు."

"ఎవరు చేస్తారు, ఎవరు చేయరు అనేది మా కనవసరం – అందరికీ ఒక్కలా పాఠం నేర్పించడమే మా ధ్యేయం !"

ఖచ్చితంగా చెప్పేసింది. స్వరం కొంచెం తగ్గించి, మరలా తనే అన్నది –

"మీరు అటువంటివారు కారనే మిమ్మల్ని క్షమాపణ అడగడానికి వచ్చేను, అడిగేను, వస్తా – మా 'ఫ్రెండ్స్' ఎదురుచూస్తున్నారు" అని, మరో మాట అనడానికూడా నాకు అవకాశ మివ్వకుండా వెళ్ళిపోయింది. అది, మా మొదటి పరిచయం !

ఆ తర్వాత రోజు, నేను 'లైబ్రరీ'లో ఏదో వ్రాసుకొంటూండగ నీలిమ వచ్చి నా ప్రక్కన నిలబడి —

"హరిగారూ, 'ఎలిజబెతన్ ట్రాజెడి రిఫరెన్స్ బుక్' మీదగ్గర ఉన్నదట. ఒకసారిస్తారా ?" అని ఎంతో మనోజ్ఞంగా అడిగింది. నిన్నటి అల్లరి ఛాయలేవి లేవు.

"న్యా పనింకా కాలేదు, రేపు ఇస్తానండీ" అన్నానేను. ఇంకొకసారి ఆమెతో మాట్లాడాలని నా ఆశ !

"నిన్నటి సంఘటనకు మేమంతా చాల బాధ పడ్డామండీ. మీరు బుద్ధిమంతులని తెలిసికూడ..."

"థాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్!" ఆవిడ అలా మాట్లాడుతుంటే, నాకెంతో సంతోషంగా, ఉత్సాహంగా ఉంది.

"కాని, మీరనుకునేటంత బుద్ధిమంతుణ్ణి మాత్రం కానండోయ్" అన్నాను చిలిపిగా.

"పోనీండి, మా అంచనా తప్పనుకుంటాం" అంది నవ్వుతూ. 'బుక్స్' విషయం, 'లెసన్స్' విషయం మాట్లాడుకొని విడిపోయాం. ఆ తర్వాత నుండి పుస్తకాలు ఇచ్చిపుచ్చుకోవడం, పిచ్చాపాటి మాట్లాడుకోవడం అలవాటైపోయింది. ప్రతిరోజూ, ఏదో ఒక విషయంలో కల్సుకొనేవాళ్ళం, మాట్లాడు కొనేవాళ్ళం ! ఆమెను చూడనిరోజున, ఆమెతో మాట్లాడని రోజున నాకు తోచేది కాదు.

అంటే ... ఆనాటి జగడం చిన్ని పరిచయానికి, ఆ పరిచయం తీయని స్నేహానికి ... ఆ స్నేహమే మధురాతిమధురమైన మా ప్రణయానికి దారి తీసిందన్నమాట !!

మధురమైన ఆ గతం, ఆ జ్ఞాపకాలు ఎంత హాయిగా ఉన్నాయ్ ! మానవునికి దేవుడిచ్చిన గొప్ప వరం మనస్సు !! దీనికి ఏ 'టేప్‌రికార్డర్లు', 'కంప్యూటర్లు' సాటి ? ఈ మనస్సులో గతంలోని మాధుర్యాన్ని నెమరువేసుకొంటూ, భవిష్యత్తులోని సుఖాలకు సోపానాలను దిద్దుకొంటూ, వర్తమానం లోని చేదును ఎదుర్కొంటాడు మానవుడు ! అసలు ఈ మనస్సనేది ఉండడం వల్లనే మనిషి జీవరాసులన్నింటిలోనూ ఉత్తమమైన వాడుగా పరిగణింపబడుతున్నాడు. లేకపోతే, తనూ ఏ పశువో, వృక్షమోలాగ ఉండేవాడేమో ! ఇంతటి అభివృద్ధి, నాగరికత ఎలా వచ్చేవి ?


జీవితంలో పొందలేని, సాధించుకోలేని ఎన్నో కోరికలను మనస్సులో ఊహించుకొని, అనుభవించి నంత తృప్తిపొందుతుంటాడు ఈ అల్ప సంతోషి ! ఒక్క క్షణంలో దేశదేశాలు, తరతరాలు తిరిగి రాగల శక్తి ఎక్కడిది ఈ మనస్సుకి! ఇంత గొప్ప మనస్సును తనకిచ్చిన ఆ సృష్టికర్త ఋణాన్ని మనిషి ఎలా తీర్చుకోగలడు ?

ఏమిటి ? ఏమిటేమిటో ఆలోచిస్తున్నాను ? ఈరోజు జరిగిందాన్ని తలంచుకొంటూ ఎక్కడికో వెళ్ళిపోయింది నా మనస్సు ! అవును – నీలిమను గురించి కదూ ఆలోచిస్తున్నాను ! అంత అల్లరి నీలిమ ఇప్పుడెంత మౌనంగా మారింది ! ఏకాంతంగా ఉన్నప్పుడు ఏవేవో కబుర్లు చెప్పుకోవాలన్పిస్తుంది నాకు. వసపోసిన పిట్టలా వాగేస్తూ ఉంటాను.

ఉన్నట్టుండి – "నేనే వాగుతున్నాను, నువ్వేమీ మాట్లాడవ్ -- నేనుకూడ మాట్లాడనులే –" అని రెండు నిమిషాలు అలిగి కూర్చుంటాను. ఈ దినం కూడ అదే చేసాను.

"కాదు, హరీ నువ్వు మాట్లాడుతూవుంటే వినడం నా కిష్టం ! నువ్వలా మాట్లాడుతూవుండు నేనిలా వింటూ, నిన్ను చూస్తూ, నిద్రాహారాలు మాని, జన్మజన్మలు ఇలాగే ఉండిపోతాను !"

నా నీలిమేనా ఈ మాటలన్నది ? నిజంనా, జన్మజన్మలు నన్ను చూస్తూ కూర్చోవాలన్పిస్తుందా తనకు ? ఇదే నిజమైతే... ఓహ్ !... నేనెంత అదృష్టవంతుణ్ణి !! కాని... నాకింకో అనుమానం ! నేనింతగా తనను గురించి ఆలోచిస్తాను కదా... మరి... తనుకూడ నన్ను గురించి ఇలాగే ఆలోచిస్తూ ఉంటుందా... ? అలా అయితే ఎంత బాగుండు !!



# వంటలు

## పులిహోర ఆవకాయ

**కావలసిన వస్తువులు :**

మామిడికాయలు — 25, ఉప్పు — ½ శేరు, కారం — ½ శేరు, ఆవపిండి — ½ శేరు, నూనె— 1 కె. జి., ఇంగువ — తగినంత, మినపప్పు — ½ కప్పు, శనగపప్పు — ½ కప్పు, ఆవాలు — 3 స్పూన్లు, జీలకర్ర—3 స్పూన్లు, కరివేపాకు, ఎండు మిర్చి — 4.

**తయారుచేయు విధానం :**

ముందుగా మామిడికాయల్ని తడిగుడ్డతో తుడిచి ఆరపెట్టుకోవాలి. కాయల్ని తడి లేకుండా చూసుకుని కత్తిపీటతో చిన్న, చిన్న ముక్కలుగా చేసుకుని ముక్కల్లో జీడి తీసివేసి బాగా తుడిచి మంచి పళ్ళెంలోకి పోసుకుని ఉంచుకోవాలి. ఆవపిండి, కారం, ఉప్పు ఒక మంచి బేసిన్‌లోకి పోసి బాగా కలుపుకోవాలి. తరువాత ముక్కలు పిండిలో కలిపేముందు కొంచెంగా పసుపు వేసి నూనె కలిపి జాడీలోకి తీసుకోవాలి. బాణలిలో నూనె ఎసరుపెట్టి కాగిన తర్వాత శనగపప్పు, మినపప్పు, ఎండుమిర్చి ముక్కలు, ఆవాలు, జీలకర్ర, ఇంగువ వేసి వేయించాలి. దించేముందు కరివేపాకు కూడా వేసి చల్లారిన తర్వాత మామిడికాయ ముక్కల్లో పొయ్యాలి. రెండు రోజుల తర్వాత ఆవకాయను తిరగ కలిపి పెట్టుకోవాలి. ఈ ఊరగాయ ఎక్కువ నెలలు నిలవ ఉండదు.

## నూపప్పు ఆవకాయ

**కావలసిన వస్తువులు :**

మామిడికాయలు — 25, నూగుండ — ¼ శేరు, కారం — ½ శేరు, ఉప్పు — ½ శేరు, ఆవపిండి — 1 సోలడు, నూనె — ¼ కె. జి.

**తయారుచేయు విధానం :**

మామిడికాయల్ని శుభ్రంగా కడిగి ఆర పెట్టాలి. తరువాత బాగా తుడిచి పెట్టుకోవాలి. కాయలమీద తడి ఉండకూడదు. ఆవకాయ కత్తిపీటతో మామిడికాయల్ని తగిన సైజుల్లో ముక్కలు చేయాలి. ముక్కల్లో జీడి తీసివేసి

# రకరకాల ఆవకాయలు

బాగా తుడిచి ముక్కల్ని ఒక పళ్ళెంలో పోసుకోవాలి. తరువాత కారం, ఉప్పు, నూపొడి, ఆవపిండి ఒక పళ్ళెంలో పోసుకుని బాగాకలపాలి. పిండిలో కొంచెం కొంచెంనూనెపోస్తూముక్కల్ని కలిపి జాడీలో వెయ్యాలి. ముక్కలు అన్నీ అయి పోయిన తర్వాత మిగిలిన పిండిని ముక్కలుమీద చల్లి నూనె పోసి మూతపెట్టాలి. మూడురోజుల తర్వాత ఆవకాయను బాగా కలిపి నూనె అవసరం అనుకుంటే కలుపుకోవాలి. ఈ ఊరగాయ ఎక్కువ రోజులు నిల్వ ఉండను.

## పెసరపిండి ఆవకాయ

**కావలసిన వస్తువులు :**

మామిడికాయలు—25, కారం — ¼ కిలో, ఉప్పు — ¼ కిలో, పెసరపప్పు—¼ కిలో, పసుపు — 1 చెంచా, ఆవపిండి — ½ కిలో, జీలకర్ర — 2 స్పూన్లు, మెంతులు — 2 స్పూన్లు, నూనె — 1 కిలో.

**తయారుచేయు విధానం :**

మామిడికాయల్ని తడిగుడ్డతో బాగా తుడిచి ఆరపెట్టుకోవాలి. తరువాత పొడిగుడ్డతో బాగా తుడిచి కత్తిపీటతో తగిన సైజులో ముక్కలు చేసుకోవాలి. ముక్కల్లో జీడి తీసివేసి ముక్కలు కూడా బాగా తుడిచి పళ్ళెంలో పోసి ఉంచుకోవాలి. పెసరపప్పును దోరగా వేయించి తిరగలిలో పోసి మెత్తగా పిండి విసురుకోవాలి. ఒక మంచి బేసిన్‌లో ఆవపిండి, కారం, ఉప్పు, పెసరపిండిని పోసి బాగా కలిసేలా కలుపుకోవాలి. పసుపు, నూనె కలిపి ఉంచుకున్న పిండిలో వేసి మామిడికాయ ముక్కలు కలిపి శుభ్రంగా ఉన్న జాడీలో పోసుకోవాలి. మెంతులు, జీలకర్ర కూడా పిండిలోనే కలపాలి. మిగిలిన నూనె ముక్కల్లో పోసి రెండు రోజుల తర్వాత తిరగ కలిపి ఉంచుకోవాలి. ఈ ఊరగాయి చాలా రుచిగా ఉంటుంది. ఎక్కువ నెలలు నిల్వ ఉండదు.

— పి. భానుమతికాత్యా

# వినిపించని రాగాలు

ఈ రోజు సాయంత్రం 'బీచ్'లో ఇదే విషయం అడిగేను —

"నీలూ... పదే పదే నువ్వు నాకు గుర్తొస్తూ ఉంటావు. ఈమధ్య చదువుమీదకూడ ధ్యాస ఉండడంలేదు. తెరచిన పుస్తకంలో నీ నవ్వులు తప్ప మరొకటి కన్పించడంలేదు. పుస్తకం మూసేసి నిన్ను గురించే ఆలోచించాలన్పిస్తుంది. మరి... నీకూ... అలాగే ఉంటుందా ? అసలు నీకు నేను గుర్తొస్తానా ?" అని భయం భయంగా, గడగడా అడిగే సీను (చెంప వాస్తుందేమోనని నా భయం!) నీలిమ చిన్ననవ్వు నవ్వి ఊర్కొంది క్రింది చూపులు చూస్తూ. నాకు కొంచెం ధైర్యం వచ్చింది.

"చెప్పు నీలిమా, నీకూ అలాగే ఉంటుందా ?"

"హరీ, అది తెలుసుకోవాలని నీకెందు కంత ఆశ ?"

"మరి, నేను తెల్సుకోవద్దా ?"

(నా భయం నాది, ఇదంతా వన్‌వే ట్రాఫిక్కేమోనని) అప్పుడు అతి నెమ్మదిగా అంది నీలిమ —

"హరీ, హర్డ్ మెలొడీస్ ఆర్ స్వీట్... బట్ దోజ్ అన్‌హర్డ్ ఆర్ స్వీటర్ !"

**ఓహ్, ఎంత మధురంగా అంది ఆ మాట !** వినిపించే రాగాలు మధురంగా ఉంటాయట. కాని... వినిపించని రాగాలు ఇంకెంతో, మరెంతో మధురాతి మధురం ! !

తన మనస్సులోని భావాన్ని ఎంత అందంగా, ఎంత సున్నితంగా చెప్పింది నా నీలు! నేను పిచ్చోడిలా ఏవేవో వాగుతుంటాను. కాని, తను ... ఈ ఒక్క వాక్యంలో తన హృదయాన్ని విప్పి నా ముందు పెట్టింది. ముగ్ధమనోహరంగా, సిగ్గుల మొగ్గై ఈ మాటలంటున్నప్పుడు ఆ కళ్ళలోని సంపెంగలను తనివిదీరా ఆఘ్రాణించాలన్పించింది ! ఆ లేత బుగ్గలలో దాగిన గులాబి మొగ్గలను ఒక్క మారుగా చుంబించాలన్పించింది !!

ప్రపంచమంతా ఎంతో సుందరంగా కన్పించ సాగింది ... ఉవ్వెత్తున ఎగసిపడే ఆ కెరటాలలో దాగిఉన్న అందాన్ని ఈనాడే దర్శించగలిగాయి నా కళ్ళు ... ఒకదాని వెనుక ఒకటిగా పరుగులిడి ఎగిరిపడే ఆ కెరటాలు ఒకరి కొరకు ఒకరు పరుగులిడే ప్రేయసీ ప్రియుల్లా అగుపించాయ్ ! లోకమంతా ప్రేమ మయంగా కన్పిస్తోంది !!!

ఎంత భావ గర్భితమైన మాట చెప్పింది నా నీలిమ ! 'కీట్స్'గారి 'ఓడ్ ఆన్ ఎ గ్రేషియన్ అర్న్' నేనెన్నిసార్లు చదువలేదు ? కాని, ఈ ఊహ నా కెప్పుడూ రాలేదే !! ఓ 'కీట్స్' మహానుభావా, ఎంత అనుభవంతో చెప్పావయ్యా నీవీ మాట ! ఇన్ని నాళ్ళుగా నాలో దాగిఉన్న అనుమానాలు, అప నమ్మకాలు — అన్నీ ... అన్నీ ... ఒక్కసారిగా పటాపంచలైపోయాయ్.

ఈ దినం ఎంత గొప్పది ? నా ప్రియసఖి హృదయాన్ని చదువగలిగిన ఈ రోజు నా జీవితంలో మధురాతి మధురంగా నిలిచిపోయే మరపురాని రోజు! ఇప్పుడు నాకెంతో ఆనందంగా ఉంది !! నా హృదయం ఎంతో ఉప్పొంగిపోతోంది !!!

వినిపించని రాగాలు ... !

అన్‌హర్డ్ మెలొడీస్ ... !!

వినిపించని రాగాలు మధురాతి మధురం ... !!! ★